06032024-MAI-04_Layout 1 3/6/2024 2:46 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

అబద్ధాల ఆర్భాటం

విత్తు నాటి, నీరు పోసి చెట్టును పెంచిందొకరు.. ఆ చెట్టు పేరు చెప్పుకొని కాయలమ్ముకునేది ఇంకొకరు అన్నట్టుగా ఉంది ఉద్యోగాల విషయంలో కాంగ్రెస్ వ్యవహారశైలి. ఉద్యోగాల భర్తీకి ఇదివరకటి కేసీఆర్ ప్రభుత్వం కసరత్తు చేస్తే కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియామక పత్రాలు పంపిణీ చేసి అంతా తన ప్రయోజకత్వమేనని చంకలు గుద్దుకుంటున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నోటిఫికేషన్లు జారీచేసి, పరీక్షలు నిర్వహించి అంతా సిద్ధం చేసింది. ఎన్నికల కోడ్ కూయడంతో నియామక పత్రాల జారీని పక్కనపెట్టింది. ఇప్పుడా ఉద్యోగాల నియామక పత్రాల అందజేత పేరిట ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆర్భాటం చేస్తున్నారు. నర్సింగ్, కానిస్టేబుల్, సింగరేణి, గురుకుల ఉద్యోగాల పత్రాలు అట్టహాసంగా పంపిణీ చేసి గత ప్రభుత్వ విజయాలను తన ఖాతాలో వేసుకోవాలని చూస్తున్నారు. ఒక్క నోటిఫికేషన్ అయినా ఇవ్వకుండానే 70 రోజుల్లో 23 వేల ఉద్యోగాలు ఇచ్చినట్టు గొప్పలు చెప్పుకొంటున్నారు. ఎవరు పెంచిన చెట్టయితేనేం పండ్లు మన బుట్టలో వేసుకుంటే చాలని సంబురపడిపోతున్నారు. ఏదో లాంఛనంగా పత్రాలు అందజేస్తే సరిపోయేదానికి కూడా రాజకీయ రంగులద్ది వాగాడంబరం చూపిస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వం పూర్తిచేసిన భర్తీ వ్యవహారాన్ని తమ రెండు లక్షల ఉద్యోగాల హామీలో కలిపేసుకుంటున్నారు. ఉద్యోగార్థులు విద్యాధికులన్న సంగతి మరచిపోయి, అబద్ధాలతో వారి విజ్ఞతను పరీక్షిస్తున్నారు.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమం నడిచిందే నీళ్లు, నిధులు, నియామకాల నినాదాల మీద. తెలంగాణ ఏర్పాటుకు ముందర దశాబ్దకాలంలో ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చింది మొత్తం 24,086 ఉద్యోగాలు మాత్రమే. అందులో తెలంగాణ వాటా కింద దక్కినవి 10,080 మాత్రమే. కాగా, స్వరాష్ట్రం సాధించిన తర్వాత తొలి సీఎంగా కేసీఆర్ ఉద్యోగాల భర్తీని ప్రాధాన్యంతో కూడిన అంశంగా చేపట్టారు. చిరుద్యోగులకు జీతాలు పెంచారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించారు. రాష్ట్ర ఉద్యోగాల భర్తీ ప్రక్రియ నిర్వహించేందుకు టీఎస్‌పీఎస్‌సీని ఏర్పాటు చేశారు. ఇక్కడి ఉద్యోగాల్లో 95 శాతం తెలంగాణ బిడ్డలకే దక్కేలా కొత్త జోనల్ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. తెలంగాణకు ఉద్యోగాల విషయంలో శాశ్వతంగా న్యాయం జరిగేలా చూసేందుకు తలపెట్టిన ఈ ప్రయత్నాలు కేంద్రం సహాయ నిరాకరణ, సాంకేతికాంశాల కారణంగా ఆలస్యమయ్యాయి.

బీఆర్ఎస్ పాలనలో తొమ్మిదిన్నరేండ్లలో 2,32,308 ఉద్యోగాలకు ప్రభుత్వపరమైన అనుమతులు మంజూరు చేసి 2,02,735 ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీచేశారు. అందులో 1,60,083 ఉద్యోగాల నియామక ప్రక్రియ పూర్తయింది. మరో 42,652 ఉద్యోగాల నియామక ప్రక్రియ జరుగుతుండగానే ప్రభుత్వం మారింది. ప్రైవేటు రంగంలో 22.5 లక్షల ఉద్యోగాలను కలుపుకొంటే మొత్తంగా 25 లక్షల ఉద్యోగాల భర్తీ ప్రక్రియ చేపట్టి ఉపాధి కల్పనలో తెలంగాణను దేశంలోనే నంబర్ వన్‌గా నిలిపింది బీఆర్ఎస్ ప్రభుత్వం. మరోవైపు బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు నిరుద్యోగంలో తొలి స్థానాలను ఆక్రమించడం గమనార్హం. బీఆర్ఎస్ రికార్డును కాంగ్రెస్ దాటడం మాటేమోగానీ అందుకోవడమే కష్టం. కేసీఆర్ నాటిన చెట్ల పండ్లను బుట్టలో వేసుకోవాలనే యావ సరే, జరగాల్సిన ప్రక్రియ మాటేమిటి అనేది ప్రశ్న. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రక్రియను సక్రమంగా, సమర్థంగా నిర్వహిస్తే అదే పదివేలని ఉద్యోగార్థులు అనుకుంటున్నారు. గురుకుల ఉద్యోగాల భర్తీలో జరిగిన గోల్‌మాల్‌పై అభ్యర్థులు ఆందోళన బాటపట్టడం మనం చూస్తున్నాం. ఇదిలా ఉంటే టెట్ నిర్వహించకుండానే మెగా డీఎస్సీ పేర కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ అభ్యర్థులతో ఆటలాడుకుంటున్నది. ఎన్నికల మ్యానిఫెస్టోలో నిరుద్యోగులకు రూ.4 వేల భృతి ఇస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు ఆ మాటే అనలేదని ప్రకటించడం విడ్డూరం. కాంగ్రెస్ ప్రభుత్వ చిత్తశుద్ధి లోపం, అనుభవరాహిత్యానికి ఇది అద్దం పడుతున్నది. ఆ సంగతి అలా ఉంచితే, ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగాలు భర్తీ చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కసరత్తు చేయాల్సి ఉంది. గత ప్రభుత్వంపై బురద జల్లడం మానుకొని తన ముందున్న కర్తవ్యంపై దృష్టి పెట్టడం అవసరం. విద్యాధికులను బూటకపు మాటలతో బోల్తా కొట్టించాలనుకుంటే కుదిరే పనికాదు. కొలువుల మీద కోటి ఆశలతో ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు న్యాయం చేయడం తక్షణ అవసరం.

నీటిపై నట విన్యాసం నవ్వులపాలు

డాక్టర్ ఆంజనేయగౌడ్
98853 52242

గత శుక్రవారం మేడిగడ్డకు వెళ్తుంటే మిత్రుల మధ్య వలపోతలవరదే పారింది. నిన్నటి కన్నీళ్లు, నేటి సాగునీళ్ల నడుమ తెలంగాణ నేలపై పారిన నెత్తురు, పడిన తండ్లాట వొడువని ముచ్చటగా మారింది. ఒకవేళ కేసీఆర్ గులాబీ జెండా ఎత్తకుంటే తెలంగాణలో ఏం జరిగి ఉండేదో ఊహించుకొని చర్చిస్తుంటే అందరికీ ఒళ్లు జలదరించింది. ఆ జెండా నీడన జన విముక్తికి జరిగిన మహా సమరం, నీళ్లనే నిప్పుల జనపాతంగా మలిచి మర్లబడేలా మండించిన కేసీఆర్ సంకల్ప తీరు ప్రజాస్వామ్య రాజకీయ చరిత్రలో మరువలేనిది. నిందల నిప్పుల దారిలో నడిచి సాగడం ఉగ్గునాడే అలవడిన రాజకీయ పార్టీ బీఆర్ఎస్. నేడు కూడా మళ్లీ తెలంగాణకు మండేలా లాగా అండగా నిలబడేందుకు ఎంతదూరమైన వెళ్లి తీరుతుంది. అది తెలిసో, తెలియకో కాంగ్రెస్ సర్కార్ కిరీటం తెచ్చిన పొగరుతో నీటిపై నట విన్యాసానికి నడుం బిగించింది.

గ్రామాల్లో జనం వాడే 'పటేలొచ్చి మళ్లీ మొదలు పెట్టే' అనే సామెతలాగా నీటిని గోకి మానిపోయిన గాయాలను రేవంత్ సర్కార్ మళ్లీ రేపింది. రాగానే కృష్ణా ట్రిబ్యునల్-2 ముందు కాలుజారిపడ్డ కాంగ్రెస్ సర్కార్, మేడిగడ్డకు మలినం పూసే కుట్రలు పన్ని, తనే కకావికలమైపోతున్నది. అదిచాలక మేడిగడ్డ నుంచి మళ్లీ పాలమూరుకు, మాన్పుకొన్న మరో రాచపుండును చర్చకు పెట్టి అద్దంలో తన అందవికారాన్ని తానే చూసుకునే పనిని హస్తం పార్టీ చేసింది. మేడిగడ్డపై బీఆర్ఎస్ సత్యాన్వేషణకు పయనమైతే, దాని నుంచి జనం దృష్టిని మళ్లించేందుకు రేవంత్ వందిమాగాధులు పాలమూరుకు రంధ్రాన్వేషణకు వెళ్లడం హాస్యాస్పదమైంది. పీఠమెక్కిన మొదటి నిమిషం నుంచే కేసీఆర్ ప్రభుత్వ చారిత్రక పనులపై విషం కక్కడమే కార్యక్రమంగా పెట్టుకొని హస్తం పార్టీ తికమకపడుతున్నది. ఎదిగినాక వాలినవారికి, ఎద గాయాలు మాన్పడానికి ఎన్ని అవస్థలు పడాల్సి ఉంటుందో అర్థమైతుందని ఆశించలేం కదా! రాష్ట్ర ఏర్పాటు నాటికి రైతుల ఆత్మహత్యలు ఆపడమనే తక్షణ కర్తవ్యం, వలసల బతుకులకు చరమగీతం పాడాలనే మానవీయ తపన, తడి ఎండి తంగేడుపూల చెట్లు కూడా మొలవని ఎడారులుగా మారుతున్న బీళ్లకు మళ్లీ విత్తు పొత్తును కుదుర్చాలనే కసి కలగలిసి గులాబీ ప్రభుత్వాన్ని సాహసోపేత పరుగుకు పురికొల్పితేనే నీటి పారుదల, సాగు రంగంలో సూర్యోదయం సాధ్యమైంది. ఎన్నో చర్యల సమ్మిళిత ఫలితంగానే 2 కోట్ల 18 లక్షల టన్నుల వరి ధాన్యం ఉత్పత్తితో దేశానికి అన్నం పెట్టే అన్నపూర్ణగా తెలంగాణ అవతరించింది. వరి ధాన్యం ఉత్పత్తిలో పంజాబ్ రాష్ట్రంతో పోటీపడే స్థాయికి రాష్ట్రం ఎదిగింది. రంధ్రాన్వేషకులు రాగలరని బెదిరి కాళేశ్వరం కట్టకున్నా, పాలమూరును పరుగులు పెట్టించకున్నా, పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయకున్నా, కొత్త లిఫ్టులు నిర్మించకున్నా, నేటికీ తెలంగాణ కన్నీళ్లతోనే కడుపు నింపుకొనే దుస్థితినే ఎదుర్కొనేది.

మంచి చేయాలని చేపట్టిన మహా నిర్మాణంలో ఏదో మూలన, ఏదో కారణాన లోపం ఏర్పడితే, తక్షణమే సరిదిద్దే పని చేయకుండా, మహా నిర్మాణమే నేల పాలు చేయాలనే కాంగ్రెస్ సర్కార్ కుట్రలు, బుద్ధి జీవులందరిలో ఏహ్యభావం కలిగించాయి. అన్నారం సభలో కేటీఆర్ వివరించినట్టుగా 1.6 కిలోమీటర్ల పొడవైన మేడిగడ్డ బ్యారేజీలో 50 మీటర్ల పరిధిలో మాత్రమే ఏర్పడిన సమస్యను తక్షణమే పునరుద్ధరించి బ్రహ్మాండంగా వినియోగించుకోవచ్చని నిపుణులు చెప్తుంటే రేవంత్ సర్కార్ మాత్రం రగడ కోసం నీళ్లలో విషం కలిపే గుణమే బయటేసుకుంటున్నది. నాతో పాటు మిత్రులం దరం సమస్య తలెత్తిన 20వ పిల్లర్‌ను పరిశీలిస్తుండగానే, జల నిపుణులు వి.ప్రకాష్, రిటైర్డ్ ఇరిగేషన్ ఈఎన్సీ వెంకటేష్‌తో పాటు అక్కడ పరిశీలనకు వచ్చారు. కేటీఆర్ బృందం మేడిగడ్డ నుంచి వెళ్లిన తర్వాత చాలాసేపు అనేక కోణాల్లో సాంకేతిక అంశాల్లో నిపుణులైన వారితో సమస్యపై లోతైన చర్చ నడిచింది. బహుళార్థక ప్రయోజనాల కోసం నిర్మించిన భారీ సాగునీటి ప్రాజెక్టులో ఏ సమస్య తలెత్తినా పరిష్కరించుకునే సాంకేతికత అందుబాటులో ఉంటే, ప్రభుత్వం ఆ దిశలో దృష్టి నిలపకుండా, నిందలను నిజమని నమ్మించేందుకే సర్వ శక్తులు ఒడ్డటం విడ్డూరమనేదే వారి అభిప్రాయం కూడా. కేసీఆర్‌ను ఏసుక్రీస్తులా శిలువకు వేలాడదీయాలనే వికృత తలంపుతో, రైతన్నల కామధేనువైన కాళేశ్వరాన్నే బలికోరుతున్న కాంగ్రెస్ సర్కార్ పిశాచి ప్రభుత్వంగా మిగిలిపోదా? 15 లక్షలకు పైగా పాత ఆయకట్టు స్థిరీకరణతో పాటు, 3.04 లక్షల కొత్త ఆయకట్టును సాకారం చేసిన కాళేశ్వరం ప్రాజెక్టును పగకు పణంగా పెడుతున్నారు. తరాలకు ఆదెరువు కోసం నిర్మించిన ప్రాజెక్టును వర్తమాన ప్రయోజనపు లెక్కల్లో మాత్రమే కొలవడం నేరపూరిత వైఖరే కదా? మొక్కజొన్నలు పండించే చోట పామాయిల్ లాంటి వాణిజ్య పంటల సాగు వైపు రైతాంగం అడుగులు పడుతున్నాయి. ఇంకా రాబోయే కాలంలో ఏ రకమైన నూతన లాభదాయక పంటల సాగు సాకారమవుతుందో ఊహించగలమా? రిజర్వాయర్లు, చెరువుల కేంద్రంగా మత్స్య పరిశ్రమే కాదు, పర్యాటకమూ ఉపాధి కేంద్రంగా వర్ధిల్లుతుంది.

> తెలంగాణ తరాల తలంపుతో తలపెట్టిన కాళేశ్వరాన్ని, కాంగ్రెస్ కేవలం ఓట్ల కుట్రకు లక్ష్యంగా చేసుకోవడం అందరికీ ఆవేదన కలిగిస్తున్నది. రాష్ట్రం, దేశం, ప్రపంచంలో అనేక సాగునీటి ప్రాజెక్టుల్లో నిర్మాణానంతర సమస్యలు తలెత్తాయి. భవిష్యత్తులోనూ వివిధ కారణాల వల్ల వస్తుంటాయి. వాటిని పాలకులు సానుకూల ధోరణితో సరిదిద్దాలే కానీ, పగ కోసం సాగదీసి, సమాధి కావాలని ఆశించడం పరిపాలనా క్రూరత్వమే అవుతుంది.

ఇక కాళేశ్వరంపై సర్కార్ కట్టుకథల లోగుట్టును విప్పి చూపేందుకు బీఆర్ఎస్ నేతలు బయల్దేరిన నాడే కాంగ్రెస్ మరో కపటత్వం ప్రదర్శించింది. దశాబ్దాల పాటు పాపాల ఖైరవుడిలా, పాలమూరు నెత్తిన శాపంగా మారిన తన చరిత్రను మరిచి, ఇల్లలుకుతూ తన పేరును తనే మరిచిపోయిన ఈగలా పాలమూరు ప్రాజెక్టు సందర్శనకు బైలెల్లింది. ఇది ఇంకా నవ్వులపాలయ్యే పని కదా? నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు అంటూ ఛలో పాలమూరు-రంగారెడ్డి పేరిట హస్తాదులు పొలిటికల్ బైలాటకు బయల్దేరింద్రు. కృష్ణా జలాల వాటా, పోతిరెడ్డిపాడు పాట పాడి కేసీఆర్ ప్రభుత్వం తట్టెడు మట్టి ఎత్తలేదంటూ మాయమాటల మహా ప్రదర్శన చేశారు. మనసే లేని మోసగాళ్లకు మంత్రదండం దొరికినట్టు అధికారం దక్కగానే అబద్ధాలకు జీవం పోసే తపస్సుకు తలపూనారు. పాత గోడలు, పందిరిగుంజలా పాలమూరును మార్చి.. వలసలకు, రుణాలకు కుటుంబాలను గాసం కుదిర్చిందే కాంగ్రెస్ ప్రభుత్వాలు. నీటి దోపిడీకి హరతులు, రైతుల చావులకు పాడెలు పట్టిందే హస్తం పాలకులు. 1977 అక్టోబర్ 28న కుదిరిన ఒప్పందం మేరకు చెన్నై తాగునీటి అవసరాలకు 15 టీఎంసీలు తరలించేందుకు, 1,500 క్యూసెక్కుల సామర్థ్యం ఉన్న లైనింగ్ కాలువ మాత్రమే నిర్మించాలి. కానీ, 11,150 క్యూసెక్కుల సామర్థ్యంతో పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీని నిర్మించి, దాన్ని 55,150 క్యూసెక్కుల సామర్థ్యానికి పెంచుకొని జలదోపిడీకి కుట్రలు చేస్తే, తిరగబడి పోరాడింది, కేంద్ర సర్కార్, బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ ముందు సమరం చేసింది బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ సర్కార్. ఉమ్మడి రాష్ట్రంలో సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా జరిగిన కృష్ణా నీటి కేటాయింపుల నష్టాన్ని సరిచేసి, పరీవాహకం, ఆయకట్టును లెక్కలోకి తీసుకొని తెలంగాణకు 500 టీఎంసీలు కేటాయించాలని పోరు చేసింది, న్యాయస్థానాల్లో కొట్లాడింది, కొత్త ట్రిబ్యునల్ ఏర్పాటుకు అహోరాత్రులు శ్రమించింది గులాబీ పార్టీ, కేసీఆర్ సర్కారే కదా! ఈ సత్యాలకు మసిపూసి కనుమరుగు చేయగలననుకోవడం కాంగ్రెస్ అవివేకం. ఆర్డీఎస్ నీటి వాటా హక్కుల కోసం కలబడ్డది, 87,500 ఎకరాలకు 15.9 టీఎంసీల నీటి కోసం అలుపెరగని పోరు చేసింది కేసీఆర్ కాక, రాహుల్‌గాంధీనా? సమైక్యాంధ్రలో సాగునీటి ప్రాజెక్టులను శిలాఫలకాలకు వేలాడదీసి, ఉమ్మడి పాలమూరు జిల్లాను బీదరికానికి బలి పశువుగా వదిలేసిందే కాంగ్రెస్ ప్రభుత్వాలు కదా! వంద ఆవులు తిన్న రాబందు, అరగక ఆరా'ధనా'లా పన అందుకున్నట్టుగా హస్తం పార్టీ నేతలు పాలమూరు ఎత్తిపోతలపై ప్రేమ జపం చేస్తే నమ్మేస్తారా? వలసకూలీల జిల్లాగా ఘనతికెక్కి, అంబలి కేంద్రాల అడ్డాగా మారిన ఉమ్మడి పాలమూరులో రాష్ట్ర ఏర్పాటు నాటికి 2 లక్షల ఎకరాలకు, ఒక్క పంటకు కూడా నీరందని దుస్థితి. పల్లేర్ల వనంలా, పాలబుగ్గల జీతగాళ్ల నిలయంగా మారిన పాలమూరు వలస పక్షి అయి ఎంత వేదనపడ్డదో అందరికీ తెలుసు.

కానీ, కేసీఆర్ సర్కార్ అధికారంలోకి రాగానే మానవీయ మిషన్ కాకతీయ పథకం ద్వారా పాడుబడ్డ బావులుగా మారిన పాలమూరు చెరువులను పునర్నిర్మాణం చేసి, వేలాది ఎకరాలకు సాగునీరు సమకూర్చింది. ఒక్క వనపర్తి జిల్లాలోనే 64 వాగులపై రూ.500 కోట్లతో చెక్ డ్యాంలు నిర్మించడం వల్ల లక్షా 90 వేల నూతన ఆయకట్టు సాగులోకి వచ్చింది. దీంతో పాటు రాష్ట్ర ఆవిర్భావానికి మునుపటి పాలకుల వివక్షకు ఆనవాళ్లయిన పెండింగ్ ప్రాజెక్టులను కూడా యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయడమే కాదు, నీటి నిల్వ సామర్థ్యం పెంచి, రిజర్వాయర్లు నిర్మించి ఆయకట్టు ఎన్నో రెట్లు పెంచింది బీఆర్ఎస్ ప్రభుత్వం. ఈ మానవీయ చర్యల వల్లనే 2014 నాటికి కేవలం 2 వేల 300 ఎకరాలకు ఒక్క పంటకు నీరందే నెట్టెంపాడు ద్వారా నేడు 2 లక్షల ఎకరాలకు సాగు నీరు పారుతున్నది. 13 వేల ఎకరాలకే సాగునీరు అందిస్తున్న కల్వకుర్తి లిఫ్టుకు కొత్త రూపం ఇవ్వడం వల్లనే, ఆ ఎత్తిపోతల పథకం కింద నేడు 3.50 లక్షల ఎకరాలకు రెండు పంటలకు సరిపడా సాగు నీరు అందుతున్నది. భీమా లిఫ్ట్ పెండింగ్ పనులు పూర్తిచేయడం ద్వారా 2.02 లక్షలు, కోయిల్‌సాగర్ సరిచేయడం ద్వారా 50 వేల ఎకరాలకు ఖరీఫ్, రబీ సీజన్లకు కావాల్సిన సాగు నీరు సమకూరుతున్నది.

> శాశ్వత కరువు విముక్తి వరప్రదాయినిగా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని రూపొందించి, సముద్రమట్టానికి 500 మీటర్ల ఎత్తున నిర్మించి, ఉమ్మడి జిల్లాలో కొత్తగా దాదాపు 7 లక్షల ఎకరాలకు రెండు పంటలకు సాగునీరు అందించేందుకు కేసీఆర్ సర్కార్ ఎన్ని ఇక్కట్లను ఎదుర్కొన్నదో? భూసేకరణకు ఇబ్బందులు, కోర్టు కేసులు తదితర అనేక అవాంతరాలు కల్పించిన కాంగ్రెస్.. పాలమూరు ఎత్తిపోతల పనులకు అడుగడుగునా అడ్డంకులు సృష్టించింది. అయినా 80 శాతానికి పైగా పనులు పూర్తిచేసి నార్లాపూర్ పంపునూ దుంకించింది. భౌగోళికంగా సంక్లిష్టమైన, అత్యంత ఎత్తున ఉండే ఉమామహేశ్వరం వద్ద ఎత్తిపోతల నిర్మించి, నల్లమల అంచులకూ సాగు నీరు పారించే లక్ష్యంతో శ్రమించింది కేసీఆర్ ప్రభుత్వం.

దానివల్లనే 2014 నాటికి 2 లక్షల ఎకరాలకూ సాగు నీరందని పాలమూరు జిల్లాలో 2023 నాటికీ 16 లక్షల ఎకరాలకు రెండు పంటలకూ నీరు పారింది. నీరే కాదు, రైతుబంధు, ఉచిత విద్యుత్తు పథకాలూ పాలమూరు రైతాంగానికి కొండంత అండగా మారాయి. సాగు, వ్యవసాయరంగ అభివృద్ధి పనులే కాదు, సంక్షేమ పథకాలూ వలసల జిల్లా వేగంగా కోలుకొని, వెలుగుల జీవితం వైపు నడిచేందుకు దోహదపడ్డాయి. ఈ నిజాలను అధికార కరవాలంతో వధించాలని కాంగ్రెస్ పాలకులు కుయుక్తులు పన్నితే, కాలమే వారికి సమాధానం చెప్తుంది. ఎన్నికల ఆటలో గెలుపునకు ఏ ఒక్క ఊత కర్రో ఉపయోగపడి, కుర్చీలో కూర్చోవచ్చు. కానీ, చరిత్ర నుదిటిన సూర్యబింబంలా చిరస్థాయిగా నిలవాలంటే జనమే జీవితమై కేసీఆర్‌లా బతుకగలగాలి. కాంగ్రెస్ పాలకులు పగతోనో లేక పెద్దగా కనపడాలనే దుగ్ధతోనో బద్నాం దరువును వేస్తున్నారు. డామిట్ కథ అడ్డం తిరిగినట్టు విష ప్రచారమూ వికటించి, రేవంత్ సర్కార్‌కు రోదన మిగిల్చే రోజులు రావడం మనందరం చూస్తాం.

(వ్యాసకర్త: తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్)

తలసరి ఆదాయం మాటేమిటి?

మాలోతు సురేష్
98856 79876

2030 చివరి నాటికి భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందనే మాట ఈ మధ్య తరచుగా వింటున్నాం. ఎస్ అండ్ పీ సంస్థ, ఐఎంఎఫ్ తమ నివేదికల్లో ఈ అంశాన్ని ప్రస్తావించాయి. రానున్న రోజుల్లో జపాన్, జర్మనీలను దాటి భారత్ బలమైన ఆర్థిక శక్తిగా రూపాంతరం చెందుతుందని అవి చెప్పాయి. మరోవైపు తీవ్రమైన పేదరికంలో మగ్గుతున్నవారి సంఖ్య గణనీయంగా తగ్గిందని మోదీ సర్కార్ గప్పాలు కొడుతున్నది. కానీ, ఇప్పటికీ మన దేశ జనాభాలో 3 శాతం వరకు ప్రజలు తీవ్రమైన పేదరికంలోనే కొట్టుమిట్టాడుతుండటం ఆందోళనకరం.

మన దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించాక నాలుగు దశాబ్దాలకు పైగా దేశ ఆర్థికవ్యవస్థ వృద్ధి మందకొడిగానే ముందుకుసాగింది. ప్రపంచీకరణ దిశగా అడుగులు వేయకపోవడం, అప్పటి ఆర్థిక విధానాలు, పారిశ్రామిక రంగానికి ప్రాధాన్యం ఇవ్వకపోవడం తదితర కారణాల వల్ల భారత్ వృద్ధి చెందలేదు. 1991లో అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు హయాంలో ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చాకే ఆర్థిక వ్యవస్థ వేగంగా పుంజుకున్నది. మాడిసన్ ప్రాజెక్టు డాటా ప్రకారం.. 20వ శతాబ్ది సగం వరకు మన జీడీపీ వృద్ధి రేటు ఏడాదికి 0.9 శాతం మాత్రమే. అదే సమయంలో జనాభా పెరుగుదల రేటు ఏడాదికి 0.8 శాతం ఉండగా, తలసరి ఆదాయం వృద్ధి రేటు 0.1 శాతమే ఉన్నది. స్వాతంత్ర్యానికి ముందటితో పోలిస్తే ఆ తర్వాత వృద్ధి రేటు పెరిగిందనేది వాస్తవమే. కానీ, అదే సమయంలో ఇతర దేశాలతో పోలిస్తే చాలా తక్కువ వృద్ధి నమోదైందనేది కూడా కాదనలేని సత్యం. వరల్డ్ బ్యాంకు నివేదిక ప్రకారం.. 2008లో 3.1 శాతంగా ఉన్న జీడీపీ వృద్ధి రేటు 2014 నాటికి 7.4 శాతానికి చేరుకున్నది. ఆ తర్వాత పడుతూ లేస్తూ 2022 నాటికి 7.2 శాతానికి చేరుకున్నది.

దేశ జీడీపీ రూ.273.1 లక్షల కోట్లు ఉండొచ్చని 2023 జడ్జెట్‌లో కేంద్రప్రభుత్వం అంచనా వేసింది. అనుకున్న లక్ష్యం ప్రకారం.. 5 లక్షల కోట్ల డాలర్లకు మన ఆర్థిక వ్యవస్థ చేరుకోవాలంటే జీడీపీ సుమారుగా 52 శాతం వృద్ధి చెందాలి. అంటే సరాసరి ఏడాదికి 8.7 శాతం వృద్ధి నమోదవ్వాలి. ఒకవేళ ఏటా రూపాయి విలువలో 4 శాతం క్షీణిస్తే.. అప్పుడు ఏటా 12.7 శాతం వృద్ధి రేటు నమోదవ్వాలి. అలా జరిగితేనే ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరిస్తుంది. అదే సమయంలో జర్మనీ, జపాన్‌ల వృద్ధి రేటు క్షీణించాలి. 1980ల నుంచి చూసుకుంటే.. ఏటా సగటున 5.6 శాతం వృద్ధి రేటు మాత్రమే నమోదైంది. ఏటా సుమారు 5 శాతం ద్రవ్యోల్బణం నమోదయ్యే అవకాశం ఉంటుంది. వీటన్నింటి ఆధారంగా అంచనాలు అటూఇటూగా మారవచ్చు.

> అత్యధిక శ్రామిక శక్తి కలిగిన భారత్ లాంటి దేశాలు ఉపాధి కల్పన, ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడం తదితర అంశాలపై దృష్టి పెడితే బాగుంటుందని ఆర్థిక వేత్తల భావన. దేశంలో ఇప్పటికే ద్రవ్యోల్బణం భారీగా పెరిగింది. 2023 డిసెంబర్‌లో 5.69 శాతం ద్రవ్యోల్బణం నమోదైంది. ఇది క్రమంగా పెరుగుతూనే ఉన్నది. 8.7 శాతంగా ఉన్న నిరుద్యోగిత రేటు ఆందోళన కలిగిస్తున్నది. గతంలో పార్లమెంట్‌లో జరిగిన 'రంగు పొగల' ఘటన ఈ కోవలోనిదే. ఉపాధి రహిత వృద్ధి, అంకెల్లో మాత్రమే కనిపించే అభివృద్ధి వల్ల దేశానికే ప్రమాదం.

దేశ తలసరి ఆదాయం చిన్న దేశాల కంటే తక్కువగా ఉండటం గమనార్హం. ఐఎంఎఫ్ ప్రకారం.. భారత తలసరి ఆదాయం 2,850 డాలర్లు మాత్రమే. 3,690 డాలర్లతో భూటాన్ మన కంటే మెరుగ్గా ఉన్నది. 34,550 డాలర్లతో జపాన్ మనకంటే చాలా ముందంజలో ఉన్నది. 56,040 డాలర్లతో జర్మనీ మనకు అందనంత ఎత్తులో ఉన్నది.

జీడీపీ గురించి చెప్పుకొనే కేంద్ర పెద్దలు, తలసరి ఆదాయం గురించి కూడా ప్రస్తావించాలి కదా! తలసరి ఆదాయం గురించి ఎవరైనా ప్రశ్నిస్తే.. 140 కోట్ల జనాభానే అసలు కారణమని తెలివిగా తప్పించుకుంటున్నారు. ప్రపంచంలోనే అత్యధిక శ్రామిక శక్తి కలిగి ఉన్న భారత్.. దాన్ని సరైన రీతిలో వినియోగించుకుంటే అదే దేశానికి బలమవుతుంది. ఒక సర్వే ప్రకారం.. ఏడాదికి రూ.5 లక్షలకు పైగా ఆదాయం ఉన్న కుటుంబాలు మన దేశంలో మూడింట ఒక వంతు మాత్రమే. మిగిలిన రెండొంతుల కుటుంబాలు పూట గడవడానికి తిప్పలు పడుతున్నాయి. పెద్దలకు, పేదలకు మధ్య అంతరం నానాటికీ పెరుగుతున్నది. దేశ సంపద మొత్తం ఒక శాతం జనాభా చేతుల్లో ఉండటమే దీనికి కారణం.

ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరిస్తుందని చంకలు గుద్దుకుంటున్న పాలకులు వాస్తవాలను విస్మరిస్తున్నారు. మన దేశంలో ఇప్పటికీ 11 శాతం జనాభా నిరుపేదలే. కడు పేదరికాన్ని అనుభవిస్తున్న సుమారు 19 కోట్ల మంది రాత్రిళ్లు ఖాళీ కడుపులతోనే పడుకుంటున్నారు. వరల్డ్ బ్యాంకు డాటా ఈ కఠోర వాస్తవాన్ని స్పష్టం చేస్తున్నది. వరల్డ్ పావర్టీ క్లాక్ తాజా నివేదిక ప్రకారం.. ఇప్పటికీ దేశ జనాభాలో 3 శాతం మంది తీవ్రమైన పేదరికంలో బతుకీడుస్తున్నారు.

2023 గ్లోబల్ హంగర్ ఇండెక్స్ ప్రకారం.. 125 దేశాల జాబితాలో భారత్ 111వ స్థానంలో నిలిచింది. అయితే దీన్ని కేంద్ర మంత్రి స్మృతిఇరానీ తీవ్రంగా ఖండించారు. సర్వే ప్రామాణికతను ఆమె ప్రశ్నించారు. అదే సమయంలో ఇటీవల నీతి ఆయోగ్ ఓ సర్వేను విడుదల చేసిం ది. మోదీ హయాంలో 24.8 కోట్ల మంది భారతీయులు పేదరికం నుంచి బయటపడ్డారని ఆ సర్వేలో తెలిపింది. అంతర్జాతీయ సంస్థలు విడుదల చేసే సర్వేల ప్రామాణికతను ప్రశ్నించే కేంద్రం దీన్నిమాత్రం సమర్థించుకున్నది. ఈ సర్వే ప్రామాణికత ఏమిటనేది ఇప్పటికీ ప్రశ్నార్థకమే. వాస్తవానికి రాజకీయాల అవసరాలకు అనుగుణంగా జీడీపీ లెక్కలు మారుతుంటాయనే విషయం చాలామందికి తెలిసిందే.

ఆర్థిక వ్యవస్థ బలపడినంత మాత్రాన దేశం అభివృద్ధి చెందినట్టా? తలసరి ఆదాయం సంగతేంటి? జీడీపీ లెక్కలతో ప్రజల స్థితిగతులను అంచనా వేయడం ఎంత వరకు సమంజసం. జీడీపీ పెరిగితేనో, ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగ